ట్రాఫిక్ కష్టాలకు చెక్!

పట్టణంలో సిగ్నల్ పోల్స్ ఏర్పాటు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టడానికి పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సిగ్నల్ పోల్స్ ఏర్పాటు చేస్తున్నారు. జహీరాబాద్‌లో లక్ష మంది జనాభా ఉండటంతో వాహనాల సంఖ్య పెరిగింది. పల్లెల నుంచి పట్టణానికి వచ్చే వారి సంఖ్య కూడా అధికంగా ఉంది. పట్టణంలోని భవాని మందిరం, కుమార్ హోటల్, బస్టాండ్, దత్తగిరి కాలనీ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండటంతో ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనాల రాకపోకల సమయంలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి పోలీసులు చర్యలు ప్రారంభించారు. భవాని మందిరం చౌరస్తా, బస్టాండ్, దత్తగిరి కాలనీ, పస్తాపూర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ జాం కాకుండా రోడ్డుపై సిగ్నల్స్ పోల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే చాలా చోట్ల సిగ్నల్ పోల్స్ ఏర్పాటు చేశారు. పోలీసుల చర్యల వల్ల పట్టణంలో కొంతవరకు ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది.





భవానీ మందిరం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సిగ్నల్ పోల్స్, పస్తాపూర్ చౌరస్తాలో సిగ్నల్ పోల్స్

> **ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**
>
> 
>
> వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రజలు కూడా సహకరించాలి.
>
> –వినయ్‌కుమార్, ఎస్ఐ జహీరాబాద్ టౌన్

క్లుప్తంగా

జోరందుకున్న వ్యవసాయ పనులు



పత్తిలో కలుపు తీస్తున్న కూలీలు

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల్లో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఆదివారం మండలంలోని పిల్లోడి, తాటిపల్లి, మక్తక్యాసారం, గార్లపల్లి, బుస్సారెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు కూలీలతో పత్తి పంటలో కలుపు తీసే పనులు ముమ్మరం చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలో గడ్డి విపరీతంగా పెరిగింది. దీంతో రైతులు పత్తి పంటలో కలుపుతీత పనులు చేస్తున్నారు. ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు.

నూతన కార్యవర్గం



నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శ్రీ కృష్ణ నగర్ కాలనీ వీరశైవ లింగాయత్ సమాజం నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందిగారి సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సురేందర్, ఉపాధ్యక్షుడిగా హెచ్‌ఆర్, మధు, కోశాధికారిగా నర్సింహాలు, ప్రచార కార్యదర్శిగా కళ్యాణ్‌రాజును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం రాష్ట్ర నాయకులు శివరాజ్‌పాటిల్, సంగారెడ్డి జిల్లా నాయకులు జయప్రకాశ్, పట్టణ అధ్యక్షుడు గందిగరాజు, కోశాధికారి రాచన్న, విజయ్, రవి పాల్గొన్నారు.

భారీ వర్షం .. ఇక్కట్లు



గాంధీచౌక్ వద్ద నిలిచిన నీటిని మళ్లిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఎడతెరిపి లేని భారీ వర్షం కురిసింది. ఏడు గంటల పాటు ఏకధాటిగా కురవడంతో వరద నీరు నిలిచి పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిల్వడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. దీంతో స్థానిక మున్సిపాలిటీ అధికారులు జేసీబీ సహాయంతో రోడ్లపై నిలిచిన నీటిని సమీప మురుగు కాల్వల్లోకి మళ్లించారు. పనులను శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఫైలేరియాపై అవగాహన



మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యులు

జిన్నారం(పటాన్‌చెరు): ఫైలేరియా నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బోధకాల వ్యాధి నిర్మూలనలో భాగంగా గుమ్మడిదల మున్సిపాలిటీ దోమడుగులో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. గుమ్మడిదల పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గ్రామాల్లో ఈ నెల 10 నుంచి 25 వరకు రెండు సంవత్సరాలు పైబడిన వారికి మాత్రమే అందజేయనున్నట్లు మండల వైద్యాధికారి మధుకర్ తెలిపారు. ప్రతీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలను వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సైదులు, వీరేశం, హెచ్‌ఈఓ శ్రీనివాస్, వైద్యబృందం భాగ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, వాసకుమారి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఉత్సాహంగా లాంగ్‌రన్



కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ముప్పా ఇంద్రప్రస్థ విలాస్స్ అసోసియేషన్, హైదరాబాద్ రన్నర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం లాంగ్‌రన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సంగారెడ్డి టౌన్ : 30 ఏళ్ల తర్వాత బాల్య స్నేహితులందరూ ఒకచోట చేరి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. సంగారెడ్డి పట్టణ శివారులోని శిశు మందిర్ పాఠశాలలో ఆదివారం 1994–95 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. విదేశాలలో స్థిరపడిన విద్యార్థులు సైతం 15 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధుర జ్ఞాపకాలను గుర్తు చేస్తూ పాఠశాల అభివృద్ధికి తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. 110 మంది విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనానికి రావడం చాలా సంతోషమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహగౌడ్ అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



పసల్వాది గ్రామంలో పర్యటిస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి పరిధి గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి అన్నారు. ఆదివారం మండలంలోని పసల్వాది గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసల్వాది గ్రామ పంచాయతీలో మురికి కాల్వలు నిండిపోవడంతో ఇళ్లల్లోకి నీరు వస్తున్నాయయి. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. గ్రామంలో ఎక్కడ చెత్త అక్కడ నిండిపోయి ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు శ్రీనివాస్, నాయకులు పావని, యాదయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ నెలకొంటుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మంత్రికుంటలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేదపండితుల మంత్రోచ్చారణలతో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై పూజలు చేశారు. ఆలయాల అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. అలాగే, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి గోవర్ధన్ రెడ్డి లక్ష రూపాయల విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువా తో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానంద్, సీనియర్ నాయకులు వెంకటేశం గౌడ్, ప్రకాశం చారి, సురేందర్ గౌడ్, నాయకులు పెంటేష్, ఆంజనేయులు, నరేందర్, ఖదీర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధనసరిలో 'అమర్ జవాన్ జ్యోతి స్మారక స్థూపం'



ఏర్పాటు చేసిన స్థూపం

జహీరాబాద్ టౌన్: తెలంగాణ–కర్నాటక రాష్ట్ర సరిహద్దులో సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామంలో ఎంతో మంది సైన్యంలో చేరి దేశ సేవ చేస్తున్నారు. సుమారు 50 మంది ఆర్మీలో వివిధ హోదాలో పని చేశారు. కొంత పదవి విరమణ చేసి పోలీసు శాఖలో సేవలు అందిస్తున్నారు. గ్రామం నుంచి ఏటా కొంత మంది ఆర్మీలో చేరుతుంటారు. విశ్రాంత జవానులు సైన్యంలో చేరేందుకు యువతను ప్రోత్సహిస్తుంటారు. అమర జవానుల జ్ఞాపకార్థం విశ్రాంత జవాన్లు, గ్రామస్తులు కలిసి గ్రామంలోని ప్రధాన చౌరస్తా వద్ద వీర్ అమర్ జవాన్ జ్యోతి స్మారక స్థూపం నిర్మించారు. ఈ నెల 15న స్థూపాన్ని ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు జవాన్ దేవరాజ్ తెలిపారు. కార్యక్రమానికి పోలీసు, ఆర్మీ ఉన్నతాధికారులు హాజరవుతున్నారని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఖానాపూర్(కె)లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. పేదలకు సీఎంఆర్‌ఎఫ్ సహాయనిధి పేదలకు అండగా ఉంటుందన్నారు. అలీఖాన్‌పల్లికు చెందిన విస్లావత్ బుజ్జిబాయికు రూ. 13,500 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గోపాల్‌రెడ్డి, నారాయణ, రాములు, గణపతి, శోభన్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల జాతర



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలో బుధవారం శ్రావణ మాసం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస్‌నగర్ కాలనీలోని ఐదు గుళ్ల పోచమ్మ ఆలయం, ఎస్సీ బస్తీలోని బోనాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కార్పొరేటర్ పుష్ప, జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటితో ముగియనున్న గ్రామసభలు

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్‌లో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభలు నేటితో ముగిశాయని ఏపీఓ రమేష్‌కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల్లో ఈ నెల 2 నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ మధ్య చేసిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించామన్నారు. నిర్ణీత కాలంలో రూ.11.75 కోట్ల నిధులు ఖర్చు చేసి పనులు చేసినట్లు చెప్పారు. అందులో రూ.4.96 కోట్ల నిధులు మెటల్ వర్క్‌లకు కేటాయించగా.. రూ.6.79 కోట్ల నిధులు కూలీల చెల్లింపు చేసినట్లు తెలిపారు. ఈ నెల 12న సోషల్ ఆడిట్‌పై మండల స్థాయి పబ్లిక్ హియరింగ్ సమావేశం ఉంటుందన్నారు.

నేడు దేవస్థానంలో అన్నదానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలోని శ్రీరామలింగేశ్వర దేవస్థానంలో శ్రావణ సోమవారం పురస్కరించుకొని స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మహేశ్, గణేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమవారం ఉ.5:30 నుంచి 7:00 వరకు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ ప్రత్యేక పూజలు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

ప్రిన్సిపాల్ శ్రీనివాస్



పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధిపై శిక్షణ ఇచ్చి జాబ్‌మేళా నిర్వహించి ఉపాధి కల్పించడంతో కళాశాలకు అడ్మిషన్లు పెరిగాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో డిజిటల్ ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులు, అంకితభావం కలిగిన బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాయి. యూనివర్సిటీ పరీక్షల్లో అద్భుతమైన ఫలితాలు సాధించారని తెలిపారు. ఏడాది కళాశాలలో ఇప్పటికే బీకాంలో 261, బీబీఏలో 51, బీఏలో 87, బీఎస్సీ లైఫ్‌సైన్స్‌లో 86, ఫిజికల్ సైన్స్‌లో లో 87 ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకున్నారు. అలాగే, లాస్ట్ ఫేజ్‌లో అడ్మిషన్లు పొంది 70 మంది జాయిన్ కావడానికి సిద్ధంగా ఉన్నారని, మొత్తం కళాశాల అడ్మిషన్లు 650 నుంచి 700కు చేరుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

అధిక వర్షం.. పంటలకు నష్టం



రాయికోడ్‌లో కురుస్తున్న వర్షం

రాయికోడ్(అందోల్): రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాను ప్రభావంతో గత నెలలో కురిసిన వర్షాలతోనే పంట పొలాల్లో తేమశాతం ఎక్కువైంది. పొలాల్లో వర్షం నీరు నిల్వడంతో పాక్షికంగా పంటలకు నష్టం వాటిల్లింది. తాజాగా నిత్యం వర్షం కురుస్తుండటంతో పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 40 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడులు పెట్టించారు. మినుము, పెసర తదితర పంటలకు సైతం నష్టం జరిగింది. అధిక వర్షాల ప్రభావంతో పంటలు పాడవకుండా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచనలు చేస్తున్నా నిత్యం వర్షాలు కురవడంతో పెద్దగా ఫలితం లేకుండా పోతోందని రైతులు చెబుతున్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

జిన్నారం (పటాన్‌చెరు): అర్హులైన రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని జిన్నారం మండల వ్యవసాయ అజారుద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త పట్టాదారు పాస్‌బుక్ పొంది, ఇదివరకు నమోదు చేసుకోని రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కావాల్సిన పత్రాలు దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డు, నామిని జిరాక్స్‌లను జతపరిచి వ్యవసాయ శాఖ అధికారికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

42శాతం రిజర్వేషన్లకు చట్టం చేయాలి

సీపీఎం ఏరియాకార్యదర్శి ప్రవీణ్‌కుమార్



అంబేడ్కర్ చౌక్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం రూపొందించి అమలు చేయాలని సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర సీపీఎం పార్టీ పిలుపు మేరకు ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపించిన బిల్లును పార్లమెంట్‌లో చట్టం చేయకుండా జాప్యం చేస్తుందని ఆరోపించారు. రిజర్వేషన్లు ప్రాతిపదికన కాకుండా.. వెనుకబడిన వర్గాలకు ఆర్థిక రాజకీయ, సామాజిక సమాన అవకాశాలు కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు సైతం బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతూ విద్వేష రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అనిల్, మల్లేశం, ఖయ్యూం, శ్రీశైలం, మల్లేశం, అనంద్, శ్రీనివాస్, రాజేశ్, భాస్కర్, అరెకటిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామదాసు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక లింగ పూజ



లింగపూజ చేయిస్తున్న బసవగీత మాతాజీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని బసవ మండపంలో కర్నాటకలోని నాగూర్ గురు బసవ పీఠాధిపతి పూజ్యశ్రీ బసవగీత మాతాజీ బసవ భక్తులతో సామూహిక లింగ పూజ చేయించారు. శ్రావణ మాసం పురస్కరించుకుని ఆమె పదిహేను రోజుల నుంచి ప్రవచనాలు బోధిస్తున్నారు. ఆదివారం ఆమె భక్తులతో లింగ పూజా కార్యక్రమం నిర్వహించారు. శివలింగానికి అభిషేకం చేసి బిల్వ పత్రాలు, పువ్వులు, అక్షింతలు సమర్పించి శివ నామస్మరణం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లింగపూజ వల్ల శివుని అనుగ్రహం పొందవచ్చని చెప్పారు. భక్తులందరూ ఒకే చోట చేరి పూజ చేయడం వల్ల ఐక్యమత్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ అధ్యక్షుడు శంకర్‌పాటిల్, జహీరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈత చెట్ల పెంపకానికి భూములివ్వాలి

జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఆశన్నగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కల్హేర్(నారాయణఖేడ్): ఈత, తాటి చెట్ల పెంపకానికి ప్రతి కల్లుగీత సొసైటీలకు ఐదు ఎకరాలు ప్రభుత్వ భూమి ఇవ్వాలని జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఆశన్నగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం కల్హేర్ మండలం మార్డిలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అమరవీరుల యాదిలో గీతన్నల సామాజిక చైతన్యయాత్ర సభ నిర్వహించారు. గౌడ సంఘాలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాటి సంరక్షణ కోసం డ్రిప్పు, బోరు మంజూరు చేయాలని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలోని నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమ ప్రారంభించాలని, హైదరాబాద్‌లో నీరా కేఫ్‌ను టెండర్ వేసి వచ్చిన ఆదాయంతో గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఈ నెల 18న సంగారెడ్డిలో యాత్ర ముగింపు సభ జరగనుందని చెప్పారు. గౌడ, కల్లుగీత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు అంజగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, జిల్లా కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు మల్లేశంగౌడ్, కుమార్ గౌడ్. సంఘం నాయకులు నరసింహగౌడ్, భూమాగౌడ్ పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా వెళ్తున్నారు..



రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనదారులు



సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ ఎక్స్‌రోడ్ అండర్ పాస్ వద్ద ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అడ్డదిడ్డంగా వాహనాలు నడుపుతున్నారు. సాయంత్రం సమయంలో మరీ రద్దీగా ఉంటుంది. ఇష్టమొచ్చినట్లు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. ఇలా చేయొద్దని సూచిస్తే ఆకతాయిలు గొడవకు దిగుతున్నారు. అధికారులు స్పందించి మల్కాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద ట్రాఫిక్ కష్టాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

నులిపురుగుల మందుల పంపిణీ



మందుల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని సాయినగర్ కాలనీలో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ ఫైలేరియా, నులిపురుగుల మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పట్టభద్రుల ఎమ్మెల్సీ సి. అంజిరెడ్డి పాల్గొని మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ అమర్ సింగ్ నాయక్, జిల్లా వైద్యాధికారిని నాగనిర్మల, జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి, డిప్యూటీ జిల్లా వైద్యాధికారిని డాక్టర్ సునంద, జిల్లా మలేరియా అధికారి డాక్టర్. ప్రవీణ్, స్థానిక వైద్యులు శశికర్ తదితరులు పాల్గొన్నారు.